# మన ప్రజా ప్రతినిధి

ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

ప్రజా ప్రతినిధి NEWS

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :257శుక్రవారం జూలై 10 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


## బండి భగీరథ్‌కు షరతులతో బెయిల్



● పోక్సో కేసులో హైకోర్టు ఉత్తర్వులు

●రూ.లక్ష పూచీకత్తుతో బెయిల్ మంజూరు

●దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశం

హైదరాబాద్, జులై 9 (మనప్రజాప్రతినిధి): పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలని, రూ.లక్ష పూచీకత్తు సమర్పించి జామీను పొందాలని న్యాయస్థానం ఆదేశించింది. పేటబషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో బండి భగీరథ్‌ను మే 16న పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆయన బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన తీర్పును తాజాగా వెలువరించారు.బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరఫు న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, భగీరథ్ ఒక విద్యార్థి అని, 45 రోజులకు పైగా జైలులో ఉండటంతో అతని భవిష్యత్తు దెబ్బతిన్నదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించే అన్ని షరతులను తప్పకుండా పాటిస్తారని తెలిపారు. మరోవైపు ప్రభుత్వ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, కేసు దర్యాప్తు దాదాపు పూర్తయిందని, నిర్ణీత గడువులో అభియోగపత్రం దాఖలు చేస్తామని తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తునకు సహకరించడంతో పాటు కోర్టు విధించిన అన్ని నిబంధనలను పాటించాలని స్పష్టం చేసింది. కాగా, మే 8న ఓ మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేటబషీరాబాద్ పోలీసులు బండి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తన 17 ఏళ్ల కుమార్తెను లైంగికంగా వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, బెదిరించడం, ఫామ్‌హౌస్‌లు, ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లకు బలవంతంగా రావాలని ఒత్తిడి తీసుకువచ్చినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు జరిపిన అనంతరం మే 16న పోలీసులు భగీరథ్‌ను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## నగరాల్లో తగ్గుతున్న పచ్చదనం... పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

❑చెట్ల నరికివేతతో కాంక్రీట్ అడవులుగా మారుతున్న నగరాలు

❑ప్రతి ఏటా పెరుగుతున్న వేడి తీవ్రత.. ప్రజల ఆరోగ్యంపై ప్రభావం

❑పచ్చదనం పెంపే శాశ్వత పరిష్కారమంటున్న పర్యావరణ నిపుణులు



జూలై 9 (మనప్రజాప్రతినిధి): ఒకప్పుడు చెట్లు, పార్కులు, చెరువులు, ఖాళీ ప్రదేశాలతో ఆహ్లాదకరంగా కనిపించిన నగరాలు నేడు కాంక్రీట్ అడవులుగా మారుతున్నాయి. జనాభా పెరుగుదల, వేగవంతమైన పట్టణీకరణ, భారీ నిర్మాణాలు, రహదారి విస్తరణ, చెట్ల నరికివేత కారణంగా నగరాల్లో పచ్చదనం రోజురోజుకూ తగ్గిపోతోంది. దాని ప్రభావం ఉష్ణోగ్రతల రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. గతంతో పోలిస్తే నగరాల్లో వేసవి కాలం మరింత తీవ్రంగా మారుతుండగా, రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు ఆశించిన స్థాయిలో తగ్గడం లేదు. దీనివల్ల ప్రజల ఆరోగ్యం, జీవన విధానం, విద్యుత్ వినియోగం, పర్యావరణ సమతుల్యతపై తీవ్ర ప్రభావం పడుతోంది. పట్టణ ప్రాంతాల్లో సిమెంట్ భవనాలు, తారు రహదారులు, భారీ వాణిజ్య సముదాయాలు వేడిని ఎక్కువగా గ్రహించి ఎక్కువసేపు నిల్వ ఉంచుతాయి. దీనివల్ల నగరాల్లో "వేడి ద్వీపాల" పరిస్థితి ఏర్పడుతోంది.
చుట్టుపక్కల గ్రామాల కంటే నగరాల్లో ఉష్ణోగ్రతలు అనేక సందర్భాల్లో రెండు నుంచి ఐదు డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. ఈ పరిస్థితి వేసవిలో మాత్రమే కాకుండా ఇతర కాలాల్లో కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది.చెట్లు తగ్గిపోవడంతో గాలి నాణ్యత కూడా క్షీణిస్తోంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్య వాయువులు, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ ప్రాంతాల నుంచి ఎగిసే దుమ్ము వాతావరణాన్ని మరింత కలుషితం చేస్తున్నాయి. చెట్లు సహజ వాయు శుద్ధి కేంద్రాలుగా పనిచేస్తాయి. అవి కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేయడంతో పాటు ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పచ్చదనం తగ్గితే ఈ సహజ రక్షణ వ్యవస్థ కూడా బలహీనపడుతుంది. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోంది. వడదెబ్బలు, నీరసం, గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, వృద్ధులు, చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలు



పెరుగుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం కోసం శీతలీకరణ పరికరాల వినియోగం అధికమవుతుండటంతో విద్యుత్ డిమాండ్ కూడా రికార్డు స్థాయికి చేరుతోంది. ఇది మరోవైపు విద్యుత్ ఉత్పత్తిపై అదనపు ఒత్తిడిని తీసుకొస్తోంది.పచ్చదనం తగ్గిపోవడం వల్ల వర్షపాతం విధానాలపై కూడా ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. చెరువులు, పార్కులు, ఖాళీ భూములు క్రమంగా అంతరించిపోవడంతో భూగర్భ జలాల పునరుద్ధరణ తగ్గుతోంది. వర్షం వచ్చినా నీరు భూమిలోకి ఇంకకుండా నేరుగా రోడ్లపై ప్రవహించి వరదలకు దారితీస్తోంది. ఒకవైపు నీటి కొరత, మరోవైపు పట్టణ వరదలు నగరాల ముందున్న పెద్ద సవాళ్లుగా మారుతున్నాయి. నగరాల అభివృద్ధి పేరుతో చెట్లను తొలగించడం కంటే వాటిని సంరక్షిస్తూ అభివృద్ధి పనులు చేపట్టడం అవసరం. ప్రతి కొత్త నిర్మాణానికి తగినంత హరిత ప్రాంతాన్ని తప్పనిసరి చేయడం, రహదారుల వెంట నీడనిచ్చే చెట్లను నాటడం, పార్కులను అభివృద్ధి చేయడం, చెరువులను పరిరక్షించడం వంటి చర్యలు అత్యవసరం. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా చెట్ల సంరక్షణను తమ బాధ్యతగా భావించాలి.పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక కార్యక్రమం కాదు, భవిష్యత్ తరాలకు ఇచ్చే భద్రత. నగరాల్లో పచ్చదనం పెరిగితేనే ఉష్ణోగ్రతలు తగ్గుతాయి, గాలి నాణ్యత మెరుగుపడుతుంది, వర్షపాతం సమతుల్యంగా ఉంటుంది, ప్రజల ఆరోగ్యం కాపాడబడుతుంది. ప్రతి మొక్కను ఒక జీవరక్షకుడిగా భావించి సంరక్షించినప్పుడే నగరాలు మళ్లీ ఆహ్లాదకరమైన జీవనానికి నిలయాలుగా మారగలవు.

## మనవడి కోసం పూరీలు చేసిన సీఎం



హైదరాబాద్, జులై 9 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మనవడిపై ఉన్న ప్రేమాభిమానాలను మరోసారి చాటుకున్నారు. నిత్యం ప్రభుత్వ కార్యక్రమాలు, పరిపాలనా బాధ్యతలతో బిజీగా ఉండే ముఖ్యమంత్రి కొంత సమయం కుటుంబ సభ్యులతో గడుపుతూ మనవడి కోరికను స్వయంగా నెరవేర్చారు. మనవడు కోరడంతో పూరీలు తయారు చేసి అతనికి అందించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.వీడియోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనవడితో ఎంతో ఆప్యాయంగా గడుపుతూ కనిపించారు. పూరీలు తినాలన్న మనవడి కోరిక మేరకు ఆయన స్వయంగా పిండిని ఒత్తి, నూనెలో వేయించి పూరీలు తయారు చేశారు. అనంతరం మనవడికి వాటిని అందిస్తూ ముచ్చటించిన దృశ్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ముఖ్యమంత్రి, "మనవడు అడిగితే కాదనగలనా? నిరంతరం ప్రజాసేవలో తలమునకలై ఉండే జీవితంలో మనవడితో కలిసి పూరీలు చేసిన ఈ మధుర క్షణాలు మరువలేనివి" అంటూ భావోద్వేగ వ్యాఖ్యను జత చేశారు.రాజకీయాలు, పరిపాలనా బాధ్యతల మధ్య లభించే కొద్దిపాటి సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని రేవంత్ రెడ్డి గతంలోనూ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ముఖ్యంగా మనవడితో గడిపే క్షణాలు తనకు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఈ వీడియోకు సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ కుటుంబ బంధాలకు ప్రాధాన్యం ఇస్తూ సాధారణ తాతలా మనవడి కోరిక తీర్చిన తీరు పలువురిని ఆకట్టుకుంటోంది. రాజకీయాలకతీతంగా ఆయన కుటుంబ ఆప్యాయతను ప్రతిబింబించిన ఈ దృశ్యాలు విస్తృతంగా పంచుకుంటున్నారు

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏఈ



కరీంనగర్, జులై 9 (మనప్రజాప్రతినిధి): కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి మండల పంచాయతీరాజ్ శాఖ సహాయ ఇంజనీర్ పైడి సతీష్‌ను రూ.10 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, గతంలో గంగాధర మండలంలో సహాయ ఇంజనీర్‌గా పనిచేసిన పైడి సతీష్ ప్రస్తుతం చొప్పదండి మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద ఫిర్యాదుదారుడు చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సంబంధించిన కొలతలను ఎం-బుక్‌లో నమోదు చేసి, వాటిని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు పంపేందుకు రూ.10 వేల లంచం డిమాండ్ చేశారు. ఫిర్యాదుదారుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ కరీంనగర్ రేంజ్ అధికారులు ఉచ్చుపన్ని, లంచం స్వీకరిస్తున్న సమయంలో పైడి సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు తీసుకున్న లంచం నగదు అతని టీవీఎస్ జూపిటర్ ద్విచక్ర వాహనం (నంబర్: టీఎస్ 02 ఎఫ్‌ఎఫ్ 8800) సీటు కింద దాచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.విధులను దుర్వినియోగం చేసి అక్రమ లాభం పొందేందుకు ప్రయత్నించినందున నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. అనంతరం అతడిని కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు సూచించారు.

# గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి సీతక్క

- ప్రణాళికాబద్ధ పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యం
- 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారమే వినియోగించాలని సూచన
- సర్పంచులకు సమగ్ర శిక్షణ కార్యక్రమం
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు, జులై 9 (మనప్రజాప్రతినిధి): గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసి, ప్రణాళికాబద్ధమైన పాలనతో గ్రామాభివృద్ధిని సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగులోని లీలా గార్డెన్‌లో నిర్వహించిన గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పాలన, చట్టాలు, నిధుల వినియోగం, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ఆర్థిక నిర్వహణ, పారదర్శక పాలనపై పూర్తి అవగాహన కల్పించేందుకే ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు తమ అధికారాలు, బాధ్యతలు, ఆర్థిక నిబంధనలపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. గ్రామసభలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. టైడ్ ఫండ్స్, అన్‌టైడ్ ఫండ్స్, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, గ్రామ పంచాయతీల స్వంత ఆదాయ వనరులకు సంబంధించిన నిబంధనలను పూర్తిగా తెలుసుకుని వాటి ఉద్దేశానికి అనుగుణంగానే ఖర్చు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల స్వంత ఆదాయాన్ని పెంచేందుకు పన్నులు, ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీరు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, హరితహారం, గ్రామ రహదారులు, మురుగు నీటి పారుదల, ప్రజారోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు చేరువవుతాయని సీతక్క తెలిపారు. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్, ములుగు జిల్లా ప్రత్యేక అధికారి సురేష్‌బాబు, అధికారులు, సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ముందు సిద్దిపేట రైతులకే మొక్కలు ఇవ్వాలి

- ఆయిల్ పామ్ మొక్కల తరలింపుపై హరీశ్‌రావు ఆగ్రహం
- జిల్లా అవసరాలు తీర్చాకే ఇతర జిల్లాలకు పంపాలని సూచన
- నర్సరీ నిర్వహణ మెరుగుపర్చాలని అధికారులకు ఆదేశం



సిద్ధిపేట, జులై 9 (మనప్రజాప్రతినిధి): సిద్ధిపేట జిల్లా రైతులకు అవసరమైన ఆయిల్ పామ్ మొక్కలు అందించిన తర్వాతే ఇతర జిల్లాలకు తరలించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. చందలపూర్ రంగనాయకసాగర్ సమీపంలోని ఆయిల్ పామ్ నర్సరీ వద్ద ఇతర జిల్లాలకు మొక్కలు తరలిస్తున్న లారీలను గమనించిన ఆయన అక్కడే ఆగి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన హరీశ్‌రావు, సిద్ధిపేట జిల్లాలో ఇంకా అనేక మంది రైతులు మొక్కల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జిల్లా రైతుల అవసరాలు పూర్తిగా తీరకముందే ఇతర జిల్లాలకు మొక్కలు పంపడం సరికాదని అభిప్రాయపడ్డారు. ముందుగా సిద్ధిపేట జిల్లాలోని ఆయిల్ పామ్ సాగు రైతులందరికీ అవసరమైన మొక్కలు అందించాలని, అనంతరం మిగిలిన మొక్కలను ఇతర జిల్లాలకు తరలించాలని సూచించారు. అప్పటి వరకు ఇతర జిల్లాలకు వెళ్లే మొక్కల లారీలను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. నర్సరీ నిర్వహణపై కూడా హరీశ్‌రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కల పెంపకంలో సరైన నిర్వహణ లేదని, నర్సరీలో ఇసుక ఎక్కువగా ఉందని, మొక్కలకు తగినంత నీరు అందడం లేదని పేర్కొన్నారు. అధికారులు ప్రతి వారం నర్సరీని సందర్శించి నిర్వహణను పర్యవేక్షించాలని సూచించారు. రైతులకు నాణ్యమైన మొక్కలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని హరీశ్‌రావు అధికారులకు సూచించారు. రైతుల ప్రయోజనాల విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

# సీతక్కకు చంద్రబాబు శుభాకాంక్షలు



అమరావతి/హైదరాబాద్, జులై 9 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ఇద్దరూ శుభాకాంక్షల సందేశాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సందేశంలో సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ప్రజలకు సేవలందించాలని కోరుకున్నారు. ఆమె ప్రజాసేవా దృక్పథాన్ని అభినందిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి నారా లోకేశ్ కూడా సీతక్కను అణగారిన వర్గాల గొంతుకగా అభివర్ణించారు. ప్రజాసంక్షేమం కోసం ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడుతూ, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆమె జీవితం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలోనే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, చంద్రబాబే తన రాజకీయ గురువని సీతక్క గతంలో పలు సందర్భాల్లో బహిరంగంగా పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ, చంద్రబాబుతో తనకున్న గౌరవప్రదమైన అనుబంధం కొనసాగుతుందని ఆమె పలుమార్లు స్పష్టం చేశారు. ప్రతి ఏడాది రాఖీ పౌర్ణమి సందర్భంగా చంద్రబాబును కలిసి రాఖీ కట్టడం ద్వారా తమ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై రాజకీయంగా ఎలాంటి వ్యాఖ్యలు వచ్చినా తాను పట్టించుకోనని సీతక్క గతంలో వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా వ్యక్తిగత గౌరవ సంబంధాలు కొనసాగుతాయని ఆమె చెప్పిన సందర్భాలు ఉన్నాయి. వేర్వేరు రాజకీయ పార్టీల్లో ఉన్నప్పటికీ చంద్రబాబు, సీతక్క మధ్య కొనసాగుతున్న గురుశిష్య అనుబంధం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. జన్మదినం సందర్భంగా చంద్రబాబు,

# 2036 ఒలింపిక్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వాలి



- గచ్చీబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభం
- క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల హామీ
- తెలంగాణ క్రీడారంగానికి కొత్త దిశ చూపిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 9 (మనప్రజాప్రతినిధి): 2036 ఒలింపిక్స్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వాలన్న ఆకాంక్షను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు. ఆ దిశగా హైదరాబాద్‌ను అన్ని విధాలుగా సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. గురువారం గచ్చీబౌలి స్టేడియంలో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉషతో కలిసి గచ్చీబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి శుభారంభం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వచ్చే నవంబర్‌లో ఖేలో ఇండియా పోటీలను తెలంగాణ నిర్వహించనున్నట్లు తెలిపారు. 82 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని నిర్మిస్తున్నామని, 2028 డిసెంబరులో యూనివర్సిటీని ప్రారంభిస్తామని వెల్లడించారు. దేశంలో క్రీడారంగానికి స్పష్టమైన విధానం లేకపోవడం వల్లే అంతర్జాతీయ స్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదని పేర్కొన్న ఆయన, తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక క్రీడా విధానాన్ని రూపొందించిందన్నారు. ప్రభుత్వంప్రైవేటు భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి క్రీడాకారులకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించిన యువతకు కూడా మంచి భవిష్యత్తు ఉంటుందని, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి తీసుకొచ్చిన క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఓటమిని సవాలుగా తీసుకుని నిరంతర సాధనతో విజయాలను సాధించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తెలంగాణకు చెందిన ఆరుగురు క్రీడాకారులకు మొత్తం రూ. 7.15 కోట్ల నగదు ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి అందజేశారు. అలాగే 2026 ఖేలో ఇండియా యూత్ గేమ్స్, జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు, హాకీ ఇండియా లీగ్, ప్రపంచ పికిల్‌బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్ వంటి ప్రతిష్ఠాత్మక క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష మాట్లాడుతూ క్రీడల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 22ఏ జాబితా నుంచి భూములకు విముక్తి

- గుట్టుపల్లె రైతులకు ఉత్తర్వులు అందజేసిన సీఎం చంద్రబాబు
- భూ వివాదాల పరిష్కారానికి చర్యలు
- రైతుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబాటు



నంద్యాల, జులై 9 (మనప్రజాప్రతినిధి): నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం గుట్టుపల్లె గ్రామంలో 22ఏ జాబితాలో నమోదైన భూములకు రాష్ట్ర ప్రభుత్వం విముక్తి కల్పించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రైతులకు 22ఏ జాబితా తొలగింపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో వివిధ కారణాలతో 22ఏ జాబితాలో చేరిన భూముల సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భూములపై రైతుల హక్కులను పరిరక్షిస్తూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు తమ భూములపై పూర్తి హక్కులతో వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగించేలా పరిపాలనా ప్రక్రియను సులభతరం చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఉత్తర్వులు అందుకున్న రైతులు తమ సమస్యను పరిష్కరించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు



# మున్సిపల్ సిబ్బంది దాడులతో భయభ్రాంతులు




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఎత్తుకెల్లిన సామాన్లను తిరిగి ఇవ్వాలి....విలేకర్ల సమావేశంలో బాధితులు రాము పెరుమాళ్, రాము సుధ ఖమ్మం, అన్ని అనుమతులున్నా....మున్సిపల్ సిబ్బంది మాత్రం తమ ఇంటిపై దాడి చేసి తినుబండారాలు తయారు చేసే సామాన్లను ఎత్తుకెళ్లారని , ఎప్పటికప్పుడు భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు రాము పెరుమాళ్, రాము సుధ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పక్కనున్న విలేకరితో ములాఖత్ అయి తమ సామాన్లను ఎత్తుకెళ్లారని ఆరోపించారు. ఖమ్మంలోని ప్రెస్ క్లబ్ లో గురువారం మధ్యాహ్నం జరిగిన విలేకరుల సమావేశంలో వారు తమ గోడును వెళ్లబోసుకున్నారు. చిన్న చిన్న తినుబండారాలు తయారు చేసి అమ్ముకుని బతుకుతున్న తమపై మున్సిపల్ సిబ్బంది, అధికారుల దాడులు పెరిగాయని, అన్ని అనుమతులున్నా....తమను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. తాము తయారు చేసే వంటల వల్ల పొగ వస్తోందని, దీని వల్ల తాము ఇబ్బంది పడుతున్నామంటూ ఇంటి పక్కనున్న విలేకరి బెదిరిస్తూ దౌర్జన్యం చేశాడని, దీనిపై పోలీసులకు పిర్యాదు చేసినా 6 నెలలు గా పట్టించుకోలేదని తెలిపారు. ఇటీవల సదరు విలేకరి పై కేసు నమోదు అయిందన్నారు. మరుసటి రోజు మున్సిపల్ సిబ్బంది వచ్చి వంట సామాన్లను తీసుకెళ్లారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారుల కాళ్లా వేళ్లా పడి సామాన్లను తెచ్చుకున్నామని, తినుబండారాల తయారీ, అమ్మకంతోనే తమ జీవనమని తెలిపారు. తాజాగా గురువారం మున్సిపల్ సిబ్బంది మళ్ళీ వచ్చి తమ వంట సామాన్లను ఎత్తుకెళ్లారని ఆరోపించారు. విలేకరి మాటలు విని ప్రతి సారి మున్సిపల్ సిబ్బంది దాడులు చేస్తూ భయ భ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. తాము ఇంట్లో లేకున్నా గేట్ తాళాలు పగులగొట్టి సామాన్లను ఎత్తుకెళ్లిన మున్సిపల్ సిబ్బంది పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# నూతన గృహప్రవేశ శుభ కార్యక్రమం




మన ప్రజా ప్రతినిధి అక్బర్పేట భూంపల్లి మండల్ సిద్దిపేట జిల్లా: అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోభూంపల్లి గ్రామంలో నూతన గృహప్రవేశ శుభ కార్యక్రమానికి హాజరు అయి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ గౌరవ శ్రీ.బక్కి వెంకటయ్య భూంపల్లి దుబ్బాక నియోజకవర్గం.భూంపల్లి గ్రామ వాస్తవ్యులు రాచమల్లు అనిత ఈరోజు నూతన గృహప్రవేశ శుభ కార్యక్రమం జరుపుకోగా చైర్మన్ వెంకటయ్య గారు హాజరు అయి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో చైర్మన్ వెంకటయ్య తో పాటు సర్పంచ్ జన్నారెడ్డి,ఉపసర్పంచ్ బాల్శెట్టి అనూష-నందం, అక్బరు పేట-భూంపల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మండల కుమార్,గ్రామ పంచాయతీ కార్యదర్శి చింతల యాదగిరి,ఇతరులు పాల్గొన్నారు

# ౹దుబ్బాకలో చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అభినందనలు




మన ప్రజాప్రతినిధి అక్బర్ పేట భూంపల్లి మండల్ దుబ్బాక నియోజకవర్గం.:సిద్దిపేట జిల్లా.దుబ్బాకలో చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అభినందనలు దుబ్బాక చేనేత సహకార సంఘం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు అంకం మధు మరియు సంఘ సభ్యులను దుబ్బాక శాసన సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి , బక్కి వెంకటయ్య తో కలిసి తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమం, సంఘ అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. చేనేత రంగానికి దుబ్బాక నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు ఉందని, కార్మికుల సమస్యల పరిష్కారానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.13 సంవత్సరాల తర్వాత జరిగిన చేనేత సహకార సంఘం ఎన్నికల్లో సభ్యులందరూ పరస్పర అవగాహనతో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అంకం మధు , సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సంఘ అభివృద్ధి మరియు చేనేత కార్మికుల సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# జాతీయ భావాలు గల విద్యార్థులను తీర్చిదిద్దడమే ఏబీవీపీ లక్ష్యం

## ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీ కృష్ణ



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 09 జూలై :అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇల్లంతకుంట మండల కేంద్రంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీకృష్ణ ఆధ్వర్యంలో గురువారం రోజున మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీకృష్ణ మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని '1949'లో నలుగురు విద్యార్థులతో ప్రయాణమైన ఎబివిపి ఇరోజు అన్ని యూనివర్సిటీలలో, కళాశాలలో అధ్యధికంగా సభ్యత్వం ఉన్నటువంటి ఏకైక విద్యార్తి సంఘం ఎబివిపి అని దేశం, ధర్మం, సంస్కృతి కోసం పనిచేసే విద్యారి సంఘం జాతీయ భావాలు కలిగినటువంటి విద్యారి సంఘం ఎబివిపి అని పేర్కొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అన్ని విద్యారంగా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూ సమాజ హితం కోసం నాటి నుంచి నేటి వరకు అలుపెరుగని పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ ఎబివిపి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విష్ణు, హరీష్, శివమణి, అరుణ్, ఫయాజ్, అంకిత్, చందూ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# తాళం పగలగొట్టి ఇంట్లోకి పాల్పడ నిందితులు



మన ప్రజాప్రతినిధి కొండపాక మండల్ : తిమ్మారెడ్డిపల్లి గ్రామం లో బుధవారం రోజు 08-07-26 గ్రామస్తుడైన గర్నేపల్లి చంద్రం అను వ్యక్తి తన ఇంటికి తాళం వేసి పని నిమిత్తం వేరే ఊరికి వెళ్లి తిరుగి గురువారం రోజు ఉదయం 9 గంటలకు వచ్చి చూసే సరికి బయట ఉన్న తాళం పగలగొట్టి ఉండడం గమనించి ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా లో ఉన్న రెండు వంక ఉంగరాలు మరియు భార్య, కూతురి వెండి పట్టీలు కనబడలేదు.అని కుకునూర్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దొంగతనం పై కేసు నమోదు చేసి కుకునూరు పల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించి క్లూస్ టీం సహాయం తొ ఆధారాలు స్వీకరించినట్టు కుకునూర్ పల్లి ఎస్ఐ బాలకిషన్ అన్నారు.

# చలో హైదరాబాద్ పోస్టల్ ఆస్కరించిన... సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు





మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 08:మెదక్ జిల్లా సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21న జరిగేటువంటి ర్యాలీ, ఆగస్టు 23 తారీఖున హైదరాబాద్ నడిబొడ్డున జరిగేటువంటి చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు మెదక్ జిల్లా కలెక్టరేట్, డైట్ కాలేజీల్లో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా సిపిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రం , రాష్ట్ర కార్యదర్శి ఎల్లం , కార్యదర్శి సుభాష్ లతో పాటు పిఆర్టియు జిల్లా అధ్యక్షులు సతీష్ రావు , రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి , ఎస్టీయూ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి రాజగోపాల్ గౌడ్ , నరేష్ యుటిఎఫ్ అధ్యక్షులు పద్మారావు , టిఆర్టిఎఫ్ అధ్యక్షులు ప్రణీత్ , నర్సింగ్ రావు ఇతర సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# భూ భారతి, రి సర్వే అవగాహనా సద్దస్సు



మన ప్రజాప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 09: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న భూభారతి,రీసర్వే కార్యక్రమంలో భాగంగా చేగుంట పట్టణ కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఏ డి,కిషన్, డిఏ రాంరెడ్డి, ఆర్డిఓ బావయ్యా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయ సహకారాలు అందించాలనీ . అన్నారు. తూప్రాన్ ఆర్డిఓ బావయ్యా మాట్లాడుతూ, ప్రజలకు,రెవెన్యూ అధికారులు అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తాం, భూముల రీసర్వే పై ప్రజలు కూడా సహకరించాలని కొని ఆడారు.మొదటిసారి చేగుంట గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చినా సందర్భంగా ఏ డి కిషన్, డి ఐ, రాంరెడ్డి, ఆర్ డి ఓ బావయ్యా, ట్రైనింగ్ కలెక్టర్ హైమద్ పాషా, తహసిల్దార్ బల్ లక్ష్మి,పాలకవర్గం సభ్యులు ఘనంగా శాలువా పూలమాలతో సన్మానించరు,ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఫిర్యాదులుస్వీకరించబడును పోలీస్ కమిషనర్



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి ప్రజలు తమ ఫిర్యాదులులతో రోజంతా వివిధ సమయాల్లో వస్తుండటంతో ప్రతి ఒక్కరి సమస్యలను సమర్థవంతంగా స్వీకరించి పరిష్కరించే ప్రక్రియలో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సిద్ధిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్, ఐపీఎస్ సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఫిర్యాదులు ప్రతి పని దినంలో మధ్యాహ్నం 03:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు స్వయంగా స్వీకరించనున్నారు.అందువల్ల సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఫిర్యాదుదారులు కమిషనరేట్ కార్యాలయాన్ని ఆయా సమయంలోనే సంప్రదించాలని ప్రజలకు తెలియజేశారు.


# దాతల సహకారంతో ప్రోత్సాహక బహుమతులు




నేరేడుచర్ల మనప్రజాప్రతినిధి దినపత్రిక )పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు 2026- 27 విద్యా సంవత్సరం నూతనంగా చేరిన విద్యార్థినీ విద్యార్థులను అభినందిస్తూ, ప్రోత్సాహకంగా రూ 5000/ లు వెచ్చించి 100 మధ్యాహ్న భోజనం ప్లేట్లను స్థానిక ఎస్ ఆర్ కె రెసిడెన్సీ సభ్యులు రావులపల్లి రోశయ్య, సుంకర క్రాంతి కుమార్, అరిబండి కిరణ్ కుమార్,కందిబండ హరిప్రసాద్ లు బహుకరించగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు ఎస్ ఆర్ కె రెసిడెన్సీ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలపట్ల నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అధిక సంఖ్యలో పంపడం హర్షనీయమని మంచి విజయాలు సాధిస్తున్న విద్యార్థులకు తమ వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని తెలియజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం జానకి రాములు శౌరి వెంకటేశ్వరరావు అన్నపూర్ణ నాగమణి భానుమతి జానయ్య వెంకటరెడ్డి బికోజి యాదగిరి రామ్మూర్తి బాలు శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాసరావు నాగేష్ లాల్ సాహెబ్ పద్మ పాల్గొన్నారు

# ఇల్లంతకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు

మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 09 జూలై :ఇల్లంతకుంట గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తూ, దరఖాస్తుల్లో ఉండే లోపాలను గుర్తించి వెంటనే సరిచేసేందుకు తేదీ 10-07-2016 శుక్రవారం నుండి ఇల్లంతకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ మామిడి రాజు తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తుల పరిశీలన, అవసరమైన పత్రాల ధృవీకరణ, వివరాల్లోని పొరపాట్ల సవరణ, సందేహాల నివృత్తి వంటి సేవలు అందించ బడుతున్నాయి. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించుకుని, అవసరమైన సవరణలు చేయించుకోగలరు.




# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలి డిప్యూటీ తాసిల్దార్ జహీర్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జులై 09,: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని దౌల్తాబాద్ డిప్యూటీ తాసిల్దార్ జహీర్ పేర్కొన్నారు మండల పారధిలోని గొడుగుపల్లి గ్రామం లో ప్రత్యేక ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్వహించి, ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు కొత్త ఓటరు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి మాట్లాడుతూ... అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ రేఖ ,ఎఫ్ ఏ దుర్గాని శ్రీనివాస్ వి ఏ ఓ సౌజన్య ప్రజలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత....




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం1500 మంది పోలీసులతో భారీ బందోబస్తు...పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి భద్రతా విధులపై దిశానిర్దేశం చేసిన పోలీస్ కమిషనర్ రేపు (శుక్రవారం) రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా, చింతకాని మండలం, జగన్నాధపురంలో ఏర్పాటు చేసిన రైతు ఆశీర్వాద సభకు విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణ, సమన్వయంపై సమగ్ర దిశానిర్దేశం చేశారు.బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు, సిబ్బందికి సభ వేదిక సమీపంలో ప్రత్యేక బ్రీఫింగ్ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సభా ప్రాంగణం మొదలు, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు ఇతర కీలక ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పోలీస్ అధికారులతో సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో భాగంగా సుమారు 1500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్త్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేటాయించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సీపీ సూచించారు. పోలీసు అధికారులకు విధి నిర్వహణలో పాటించాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలతో మర్యాదపూర్వక వ్యవహారం, వీఐపీ భద్రత తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ లు సారంగపాణి, తిరుపతి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.బందోబస్త్ ఫోర్స్ :అడిషనల్ డీసీపీఎస్ 04ఎసిపిఎస్ 12 సిఐఎస్ / ఆర్ ఐఎస్ 58సిఐఎస్/ ఆర్ ఎస్ ఐ ఎస్ 151ఎఎస్ఐ /హెచ్ సిఎస్ /గాజం ఫిజిఎస్ / హెచ్ జి ఎస్ - 1300

# వివరాలు పక్కాగా నమోదు చేయాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు పత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం పట్టణంలోని 40వ వార్డులో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి, సర్వే జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. వార్డులోని ఇళ్లకు వెళ్లిన కలెక్టర్.. ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్న విధానాన్ని దగ్గరుండి గమనించారు. ఒక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన, వారికి ఎన్యుమరేషన్ ఫామ్‌ను స్వయంగా అందజేశారు. సర్వేలో భాగంగా అడిగే ప్రశ్నలకు ప్రజలందరూ సహకరించి, సరైన సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని ఎన్యుమరేటర్లను, సూపర్వైజర్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా సర్వే చేయాలని, ఏ ఒక్క ఇల్లు కూడా మిస్ కావద్దని సూచించారు. డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాలు ఆర్డీవో వేణుమాధవరావు, డిప్యూటీ తాసిల్దార్ లాలు బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు

# పాత్రికేయుడు రవీందర్ ను పరామర్శించిన మీడియా మిత్ర బృందం

మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 08: చేగుంట మండలం మక్కరాజిపేట గ్రామానికి చెందిన ఏ వి ఆర్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయుడు ఎర్రం రవిందర్ కు ఇటీవల కాలుకు చికిత్స(సర్జరీ) చేయించుకున్న విషయం తెలుసుకున్న చేగుంట మండల మీడియా మిత్ర బృందం గురువారం తన సగృహంలో కలిసి పర్శించారు. కాలుకు ఎవిదంగా ఆపరేషన్ చేయాల్సి వచ్చిందో, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. . ఈ కార్యక్రమం లో పాత్రికేయులు మొహమ్మద్ ముజామిల్, కొండి శ్రీనివాస్, సబ్బని శ్రవణ్, ప్రకాష్, దేవేందర్, అన్నం మహేష్, సోమా ప్రవీణ్, స్టాలిన్ నర్సిములు, నాగార్జున, సతీష్, పాల్గొన్నారు.




# జూలై 10న చింతకానిలో భారీ రైతు ఆశీర్వాద సభ

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు 3 లక్షల మంది రైతులు హాజరవుతారని అంచనాలిసభకు ప్రతి రైతు హాజరై ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపు 9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం 1,67,877 కోట్లు వ్యయం రైతు భరోసా, ఆశీర్వాద సభ ఏర్పాట్లపై మీడియా సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం చింతకాని,జూలై 10న ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం గ్రామం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.గురువారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో డిప్యూటీ సీఎం, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి రైతు భరోసా ఆశీర్వాద సభపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూలి వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అందించిన నేపథ్యంలో జూలై 10న రైతు ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మంత్రివర్గసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 3 లక్షల మంది రైతులు ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని, రైతులకు ప్రతి అడుగులో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని చెప్పారు.గత ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద పదేళ్లలో మొత్తం రూ.72 వేల కోట్లు మాత్రమే అందించిందని, తమ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా క్రింద



రూ.35,830 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు.వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఒక లక్ష 67 వేల 877 కోట్లను వెచ్చించిందన్నారు. రైతు రుణమాఫీ, ధాన్యానికి బోనస్, పంటల బీమా, పంట నష్టపరిహారం, ఉచిత విద్యుత్, విద్యుత్ సబ్సిడీ, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పలు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఈ నిధులను వినియోగించినట్లు వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు.ఖమ్మం జిల్లా అంటేనే వ్యవసాయానికి ప్రతీక అని, నాగార్జునసాగర్ వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వ్యవసాయాభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, భవిష్యత్తులో రైతులకు మరింత మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తామని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడంలో మీడియా ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని, కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎమ్మార్వో ను సన్మానించిన పాలకవర్గం



మన ప్రజా ప్రతినిధి కొండపాక: కుక్కునూరు పల్లి మాజీ ఎమ్మార్వో సుజాత పలు భూ అక్రమ లావాదేవీల్లో సస్పెన్స్ కు గురైన విషయం తెలిసిందే, ఆమె స్థానంలో ఇన్చార్జి ఎమ్మార్వోగా అక్బర్ పేట్ భూంపల్లి లో డిప్యూటీ తహసిల్దారుగా చేస్తున్న వేణుగోపాల్ రావును కుకునూరు పల్లి ప్రస్తుత ఎమ్మార్వో గా కలెక్టర్ నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండల పరిధిలోని మేదిన్ పూర్ గ్రామ సందర్శనకు వెల్లి గ్రామ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఈ ఫారాలను ఎలా నింపుతున్నారు, ఎదురవుతున్న సవాలు ఏమిటి అనే విషయాలపై అయన వాకబు చేసి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈసందర్భంగా గ్రామానికి వచ్చిన నూతన ఎమ్మార్వోను గ్రామ పంచాయితీ పాలకవర్గం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.